క్లుప్తంగా

బాలికల వసతి గృహం సందర్శన



వసతి గృహంలో ఆహారాన్ని పరిశీలిస్తున్న బులికృష్ణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధారలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహాన్ని ఆదివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.కె.వి.బులికృష్ణ సందరర్శించారు. అక్కడి వసతులను, బాలికలకు అందిస్తున్న ఆహారాన్ని స్వయంగా ఆయన పరిశీలించారు. హాస్టల్ సంక్షేమ అధికారి గిరీశ్వరి, పారాలీగల్ వలంటీర్, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న ఎస్‌ఐ గౌరి

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లు, పాత నేరస్తులకు సీఐ శ్రీనివాసరావు పర్యవేక్షణలో మహిళా ఎస్‌ఐ గౌరి కౌన్సెలింగ్ నిర్వహించారు. వారి దినచర్య, సత్ప్రవర్తనతో కలిగి ఉంటున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పలు కేసుల్లో ఉన్న వారి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ త్వరలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అల్లర్లు, గొడవలు చేయకుండా ఉండాలన్నారు. హద్దు మీరితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేరాల జోలికి పోకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని సూచించారు.

ఇద్దరికి ఆర్థిక సాయం



లక్ష్మణరావుకు నగదు అందిస్తున్న మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ సభ్యులు

మురళీనగర్: ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా ఆదివారం మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ సభ్యులు సేవా కార్యక్రమం నిర్వహించారు. మురళీనగర్ శ్రీదేవి పార్క్‌లో శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న పట్టాభిరెడ్డి గార్డెన్స్‌కు చెందిన లక్ష్మణరావు అనే వ్యక్తికి రూ.10,000, మద్రిపాలెం మహారాణి వీధికి చెందిన నాటక కళాకారుడు తిరుమలరావుకు రూ.5,000 ఆర్థిక సాయం అందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్, కార్యదర్శి సీతారామకృష్ణ, కోశాధికారి కేవీ వర్మ, సంయుక్త కార్యదర్శి పి.సంతోష్‌కుమార్, నిర్వహణ కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

● నేత్రపర్వం.. హిమ లింగం



మహా శివరాత్రి పర్వదినాన మంచుతో ఏర్పాటు చేసిన శివలింగం చూపరులను ఆకట్టుకుంది. స్థానిక శ్రీనివాస్ స్వీట్ స్టాల్ యజమాని దున్న ప్రతాప్ తన షాపు ముందు సుమారు పది అడుగుల పొడవు, మూడు అడుగుల వెడల్పుతో హిమ లింగాన్ని ఏర్పాటు చేసి, శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు పూజలు జరిపించారు. శివరాత్రి జాగారాన్ని దృష్టిలో పెట్టుకుని శివపురాణం, శివలీలలు వంటి కథా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

– మల్కాపురం

ఆటలకు సై..!



కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఆధునీకరించిన ఆట మైదానం



క్రీడల్లో తర్ఫీదు పొందుతున్న విద్యార్థులు



- ● పాలిటెక్నిక్ కాలేజీలో అందుబాటులోకి ఆధునిక క్రీడా మైదానం
- ● స్పోర్ట్స్ మీట్‌కు అనుగుణంగా మార్పులు

మురళీనగర్: కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఆధునిక ఆట స్థలం అందుబాటులోకి వచ్చింది. ఇక్కడ విశాలమైన మైదానం ఉన్నా.. అది అన్ని రకాల ఆటలకు అనుకూలంగా ఉండేది కాదు. టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సి.నాగరాణి ఆదేశాల మేరకు స్థానిక ప్రిన్సిపాల్ జి.వి.సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో ఈ స్థలాన్ని అభివృద్ధి చేశారు. సుమారు రెండు ఎకరాల్లో విద్యార్థినీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆట మైదానాలను ఆధునీకరించారు. స్పోర్ట్స్ మీట్‌లకు అనుగుణంగా తీర్చిదిద్దారు. ఇందుకోసం రూ.3.50 లక్షల ఖర్చు చేశారు.

బాలబాలికలకు ప్రత్యేకంగా..

బాలుర ఆట మైదానంలో 200 మీటర్ల ట్రాక్‌ఫీల్డ్, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్ కోర్టు ఏర్పాటు చేశారు. స్పోర్ట్స్ విభాగానికి సంబంధించి హైజంప్, లాంగ్ జంప్, షాట్ పుట్ క్రీడల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టారు. బాలికల ఆట మైదానంలో కోకో, బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్, లాంగ్ జంప్, హైజంప్‌నకు ఏర్పాట్లు చేశారు. ఫార్మసీ బ్లాక్ వద్ద కబడ్డీ కోర్టు అందుబాటులోకి తెచ్చారు. ఇక్కడి వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులకు ప్రత్యేకంగా దాని ప్రాంగణంలో బాల్‌బ్యాడ్మింటన్, వాలీబాల్ కోర్టులు సిద్ధం చేశారు. ఇటీవల ఈ కాలేజీలో పలు సౌకర్యాలను పరిశీలించడానికి వచ్చిన సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ సి.నాగరాణి ఆట స్థలాలను పరిశీలించి మెచ్చుకున్నారు. విద్యార్థులను వివిధ పోటీలకు సిద్ధం చేస్తున్నామని ప్రిన్సిపాల్ జి.వి.సత్యనారాయణ మూర్తి తెలిపారు.

క్రీడలకు ప్రాధాన్యం



డిప్లొమా స్థాయిలో విద్యార్థులు క్రీడల్లో పాల్గొనేలా ప్రణాళికలు అమలు చేస్తున్నాం. విద్యార్థులకు వివిధ రకాల ఆట పరికరాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులను వివిధ పోటీలకు సిద్ధం చేస్తున్నాం. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం క్రీడల్లో తర్ఫీదు ఇస్తున్నాం. ఈ క్రీడా మైదానంలో ఇటీవల జిల్లా స్థాయి పాలిటెక్నిక్ క్రీడా పోటీలను నిర్వహించాం.

– అబ్బాస్ బేగ్, ఫిజికల్ డైరెక్టర్

స్వాతిముత్యం సినిమా ఎన్నటికీ ఆణిముత్యమే

ఆ చిత్ర సినిమాటోగ్రాఫర్ రఘు



మాట్లాడుతున్న సినిమాటోగ్రాఫర్ ఎం.వి.రఘు

ఏయూక్యాంపస్: తెలుగు సినీ చరిత్రలో స్వాతిముత్యం సినిమా ఒక ఆణిముత్యంగా నిలిచిపోతుందని సినిమాటోగ్రాఫర్ ఎం.వి.రఘు అన్నారు. స్వాతిముత్యం విడుదలై 37 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ చిత్రానికి సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసిన రఘుతో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఏయూ హిందీ భవన్‌లో ఇష్టాగోష్ఠి నిర్వహించారు. ముందుగా సినీ నటుడు తారకరత్న మరణానికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. అనంతరం ఎం.వి.రఘు మాట్లాడుతూ చిత్ర నిర్మాణంలో దర్శకేంద్రుడు కె.విశ్వనాథ్‌తో పనిచేసిన సందర్భం, సంఘటనలను వివరించారు. విశ్వనాథ్ దర్శకత్వం, ఇళయరాజా సంగీతం సినిమాకు ప్రాణం పోశాయన్నారు. విశ్వనాథ్ ఆలోచన విధానంతో ఈ చిత్రాన్ని ఒక కళాఖండంగా తీర్చిదిద్దడంలో తన పాత్ర కూడా ఉండటంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. తెలుగు సినిమా ఉన్నంత కాలం ఈ సినిమా ప్రజలకు గుర్తుంటుందన్నారు. వయసుతో సంబంధం లేకుండా, అందరూ చూడదగిన సినిమాగా స్వాతిముత్యం ఉంటుందన్నారు. దక్షిణ భారత దేశంలో తొలి సారిగా ఆస్కార్‌కు పంపిన ఈ సినిమా ఎంతో ప్రత్యేకమని పేర్కొన్నారు. విశ్వనాథ్‌తో తరువాత సిరివెన్నెల సినిమాలో పనిచేయడం గొప్ప అనుభూతి కలిగిందన్నారు. ఆయన మరణం తెలుగు సినిమా పరిశ్రమకు తీరని లోటని చెప్పారు. విలేకరుల సమావేశంలో వీఎఫ్ఎస్ అధ్యక్షుడు ఆచార్య ఎస్.ఎ.డి పాల్, కార్యదర్శి నరవ ప్రకాశరావు, సహాయ కార్యదర్శి బి.చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో ఉషా, ఛాయా సూర్యనారాయణమూర్తి

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై అలమేలు మంగమ్మ ఆలయంలో వెలసిన శ్రీ సూర్యనారాయణమూర్తి దేవాలయంలో మాఘమాసం ఐదవ ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు పాణంగిపల్లి కేశవాచార్యులు ఆధ్వర్యంలో మూలవిరాట్టుకు ప్రత్యేకంగా గోక్షీరంతో అభిషేకం, పంచామృతాభిషేకాలు చేపట్టారు. అనంతరం మందార, చామంతి, గులాబి పుష్పాలతో స్వామి వారిని విశేషంగా అలంకరించారు. ఉషా, ఛాయా సమేత సూర్యనారాయణస్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు బారులు తీరారు.

కమనీయం.. అప్పన్న కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

పబ్లిక్ డిమాండ్

పైపు లీకుతో తాగునీరు వృథా



మధురానగర్‌లో లీకవుతున్న తాగునీటి పైప్‌లైన్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్‌లోని జీవీఎంసీ హైస్కూల్ సమీపంలో తాగునీటి పైప్‌లైన్ లీకవుతోంది. దీనివల్ల చాలా కాలంగా నీరు వృథాగా పోతోంది. పైపు లీకు వల్ల కుళాయిల్లో వచ్చే నీటి ధారలు తగ్గుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టేలా చర్యలు చేపట్టాలి.

– మధురానగర్ వాసులు

రోడ్డు మధ్యలో డంపర్ బిన్



రెల్లివీధి రోడ్డు మధ్యలో ఏర్పాటు చేసిన డంపర్ బిన్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట రెల్లి వీధికి వెళ్లే మార్గంలోని రోడ్డు మధ్యలో డంపర్ బిన్ ఏర్పాటు చేశారు. 60 అడుగుల విశాలమైన రహదారికి ఒక పక్కగా ఏర్పాటు చేయాల్సిన డంపర్ బిన్‌ను మధ్యలో పారిశుధ్య సిబ్బంది ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. బిన్ వద్ద నిత్యం చెత్త కుప్పలు కుప్పలుగా పడి ఉంటోంది. ప్రజలకు ఇబ్బంది కలగకుండా మెరుగైన పారిశుధ్యానికి చర్యలు చేపట్టాలి.

– డి.శ్రీనివాసరావు, రెల్లివీధి

గెడ్డల నిర్వహణ ఘోరం

- ● మురుగు ప్రవాహానికి అడ్డంగా డెబ్రిస్
- ● దుర్వాసన వెదజల్లుతున్న వైనం



గొల్లకంచరపాలెం గెడ్డలో మురుగు ప్రవాహానికి అడ్డంగా డెబ్రిస్ మూటలు



శిథిలావస్థలో దుర్గానగర్ డ్రైనేజీ రక్షణ గోడలు

కంచరపాలెం: జీవీఎంసీ 56,57 వార్డుల పరిధిలోని కంచరపాలెం, ఊర్వశికూడలి, ఐటీఐకూడలి, 104 ఏరియా, మద్రిపాలెం ప్రాంతాల్లో గెడ్డలు, కాలువల నిర్వహణ గాడితప్పింది. గొల్లకంచరపాలెం తోట వీధి, దుర్గానగర్, గౌరీనగర్, సుభాష్‌నగర్, శ్యామ్‌నగర్ గెడ్డలు శిథిలావస్థకు చేరాయి. గెడ్డల్లో పూడికలు తొలగించక పోవడంతో చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. వర్షాలు పడేటప్పుడు గెడ్డల్లో మురుగు నీరు రోడ్లపైకి చేరుతోంది. దీంతో అటుగా వెళ్లే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా కాలనీల్లో ఇళ్ల నిర్మాణ వ్యర్థాలు గెడ్డల్లో వేస్తున్నా టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో పూడికలతో నిండి పోతున్నాయి. వీటిపై ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

నిర్లక్ష్యం..

పూడికల తొలగించడానికి టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు సక్రమంగా చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శంగా నిలుస్తోంది. పూడిక తీత పనుల ప్రారంభించేటప్పుడు ఉన్న శ్రద్ధ నిర్వహణ విషయంలో ఉంటే బావుంటుందని పలువురు చెబుతున్నారు.

ఇక్కడ శిథిలం..

గొల్లకంచరపాలెం నుంచి సుభాష్‌నగర్, భవాని గార్డెన్ వరకు రైల్వేట్రాక్ రహదారికి ఆనుకొని ఉన్న గెడ్డలు శిథిలావస్థకు చేరాయి. తోటవీధి గెడ్డలో సమీప కేటరింగ్ నిర్వాహకులు నిత్యం వ్యర్థాలు వేయడంతో మురుగు ప్రవాహనానికి అడ్డంకిగా మారుతోంది. వాటికి మరమ్మతులు చేపట్టడంతో పాటు చెత్తాచెదారాలు, పశు కళేబరాలు నిలిచిపోవడంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. జోన్–5 పబ్లిక్ హెల్త్, ఇంజినీరింగ్ అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

నూతన సేవా సంస్థ ప్రారంభం



క్లబ్ నూతన సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఉమామహేశ్వరరావు

డాబాగార్డెన్స్: విశాఖపట్నం నార్త్ ఈస్ట్ డైమండ్స్ లయన్స్ క్లబ్ నూతన సేవా సంస్థ ఆదివారం ప్రారంభమైంది. అధ్యక్షునిగా కంకటాల సతీష్, కార్యదర్శిగా మామిడి ప్రకాష్, కోశాధికారిగా కె. శ్రీలక్ష్మిచే ఏయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న లయన్స్ గవర్నర్ ఎం. ఉషారాజు ఎన్నికైన సభ్యులు నియమ నిబంధనలు పాటిస్తూ సేవా కర్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎ. గోపాలరావు, సీహెచ్ కృష్ణమూర్తి, వి. సాయినిర్మల, సీహెచ్ చందన, పద్మజ, టి. ఉషశ్రీ, ఎస్. సోమరాజు, సీహెచ్ కాశీ విశ్వనాథ్, ఎంవీ రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్ఐ ప్రాథమిక పరీక్ష



సీతంపేట శ్రీవిశ్వ కళాశాల వద్ద అభ్యర్థులను తనిఖీ చేసి పంపిస్తున్న పోలీసు సిబ్బంది

సీతంపేట: పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాలకు ఆదివారం నిర్వహించిన ప్రాథమిక పరీక్ష ప్రశాంతంగా జరిగింది. సీతంపేట ప్రాంతంలో బుల్లయ్య కళాశాల, బీవీకే కళాశాల, ప్రిజమ్ కళాశాల, శ్రీవిశ్వ కళాశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పేపర్ 1, తిరిగి 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్ 2 పరీక్ష జరిగింది. ద్వారకా పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అభ్యర్థుల హాల్ టికెట్లు, గుర్తింపు కార్డు తనిఖీ చేసి అరగంట ముందుగానే పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. మొబైల్ ఫోన్, ట్యాబ్, స్మార్ట్ వాచ్ వంటి ఎల్రక్టానిక్ గాడ్జెట్స్‌ను కేంద్రంలోకి తీసుకెళ్లకుండా చర్యలు చేపట్టారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై సమీక్ష



కార్పొరేటర్లు, పార్టీ నాయకులతో సమీక్ష నిర్వహిస్తున్న ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

సీతమ్మధార: త్వరలో జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్లు, పార్టీ వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లతో పలు అంశాలపై చర్చించారు. పోలింగ్ బూత్‌ల వారీగా ఇన్‌చార్జుల నియామకం, ఓటర్లతో మమేకమై నిర్వహించాల్సిన ప్రచారాలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ తమ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు ప్రతి ఒక్కరూ క్షేత్ర స్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, స్టాండింగ్ కమిటీ మెంబర్ బర్కత్ అలీ, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, కంటిపాము కామేశ్వరి, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, చల్లా రజని, కె.వి.ఎన్.శశికళ , కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, పార్టీ వార్డు అధ్యక్షులు పైడి రమణ, పీలా వెంకటలక్ష్మి, నీలి రవి, షేక్ జుబేర్, కె.పి.రత్నాకర్, దువ్వలపూడి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు జి.వి.రమణిరెడ్డి, బులుసు జగదీష్, కె.వెంగళరావు, సచివాలయ కన్వీనర్ కర్రి మురళీకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

చిత్ర పరిశ్రమకు నిఘంటువు విశ్వనాథ్



కళాతపస్వి కె.విశ్వనాథ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అతిథులు

సీతంపేట: కళాతపస్వి కె.విశ్వనాథ్ 93వ జయంతి వేడుకలు వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా జరిగాయి. ముందుగా తారకరత్న మృతికి రెండు నిమషాలు మౌనం పాటించారు. అనంతరం కె.విశ్వనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వనాథ్ దర్శకత్వంలో రూపొందిన స్వాతిముత్యం, సిరివెన్నెల సినిమాలకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసిన ఎం.వి.రఘును ఈ సందర్భంగా సత్కరించారు. అతిథిగా సీనియర్ నటుడు ఎస్.కె.మిశ్రో మాట్లాడుతూ విశ్వనాథ్‌తో జ్ఞాపకాలను, ఆయన దర్శకత్వంలోని సాగర సంగమం, సిరివెన్నెల చిత్రాల్లో నటించానని గుర్తుచేశారు. ఎం.వి.రఘు మాట్లాడుతూ చిత్ర పరిశ్రమకు కె.విశ్వనాథ్ ఒక నిఘంటువని పేర్కొన్నారు. నిబద్ధత, క్రమశిక్షణ, సమయపాలన, క్లుప్తత, స్పష్టత గుణాలను ఆయన నుంచి నేర్చుకున్నానన్నారు. సొసైటీ కార్యదర్శి ప్రకాశరావు మాట్లాడుతూ త్వరలో విశ్వనాథ్ ఫిల్మ్ ఫెస్టివల్ పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించే ఆలోచన ఉన్నానమన్నారు. అనంతరం స్వాతిముత్యం సినిమాను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆచార్య ఎస్.ఎ.డి.పాల్, బి.చిన్నారావు, కాశీ విశ్వేశ్వరరావు, డాక్టర్ బాబ్జీ పాల్గొన్నారు.

ఆనంద్‌మార్గ్ ఆశ్రమానికి వితరణ



నిత్యావసర సరకులు, సామగ్రి అందిస్తున్న రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఇందిరానగర్‌లోని ఆనంద్‌మార్గ్ ఆశ్రమానికి రాష్ట్ర భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు ఆదివారం నిత్యావసర సరకులు, సామగ్రి అందజేశారు. ఇక్కడ ఉన్న అనాథ పిల్లలకు ఉపయోగపడే వస్తువులు అందించిన అధికారులకు ఆశ్రమ స్వామీజీ సౌమ్యానంద అవదూత కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ బాలకృష్ణ మాట్లాతూ విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. ఓర్పు, సహనంతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ద్వారకానగర్ సబ్ రిజిస్ట్రార్ నారాయణ, మధురవాడ సబ్ రిజిస్ట్రార్ మోహనరావు, విశాఖ సబ్ రిజిస్ట్రార్ గీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తగదు

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే దీక్షలు ఆదివారంతో 687వ రోజుకు చేరుకున్నాయి. కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నాయకులు దీక్షలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రెసిడెంట్ మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగ సంస్థ గానే కొనసాగాలన్నా రు. అంత వరకు ఈ దీక్ష సాగిస్తామని తెలిపారు. దీక్షా శిబిరంలో జిల్లా జనరల్ సెక్రటరీ బి.నాగభూషణం, ప్రధాన కార్యదర్శి కె.ఈశ్వరరావు, సూరప్పడు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

సీతమ్మధార: కేజీహెచ్ సూపరింటెండెంట్ పి.అశోక్‌కుమార్‌ను 14వ వార్డు శ్రీగణేష్ సేవా సంఘం అధ్యక్షుడు టీఎస్‌పి న్‌మూర్తి ఆధ్వర్యంలో ప్రతినిధులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

తహశీల్దార్ వారి కార్యాలయం, గోపాలపట్నం

రి.క.నెం. 152/2023/A/Dt14/2/2023

పత్రికా ప్రకటన

గోపాలపట్నం మండలం, మద్రిపాలెం గ్రామ కాపురస్తుడు శ్రీ పి.హిమసాగర్ రెడ్డి, తండ్రి శంకర్ రామకృష్ణ రెడ్డి, డోర్ నెం. 39-9-17/4/4, అమ్మ రెసిడెన్సీ, మురళీనగర్, మాధవధార గ్రామం, గోపాలపట్నం మండలం, విశాఖపట్నం వారు ULC Lands (C&R) Act 1976 ప్రకారం ఈ క్రింది పట్టికలో తెలిపిన స్థలమునకు నిరభ్యంతర ధృవీకరణ పత్రము (NOC) మంజూరు చేయవలసినదిగా కోరియున్నారు.

గ్రామం పేరు	సర్వేనెం.	విస్తీర్ణము
మాధవధార గ్రామం	39-1A1/1A1 Part	50 Sq.Yds

పైన తెలిపిన భూమికి నిరభ్యంతర ధృవీకరణ పత్రము మంజూరు చేయుటకు ఎవరికయినా ఎటువంటి అభ్యంతరములు ఉన్నచో, ఈ ప్రకటన వెలువడిన 15 దినములలోగా శ్రీ జాయింటు కలెక్టరు మరియు కాంపిటేంట్ అథారిటీ, అర్బన్ ల్యాండ్‌సీలింగ్, కలెక్టరు కార్యాలయము, విశాఖపట్నం వారికి మరియు శ్రీ తహశీల్దార్, గోపాలపట్నం వారికి లిఖిత పూర్వకముగా తెలియజేయవలసినదిగా కోరడమైనది.

శ్రీ పి. హిమసాగర్ రెడ్డి
తండ్రి: శంకర్ రామకృష్ణ రెడ్డి
డోర్ నెం. 39-9-17/4/4, అమ్మ రెసిడెన్సీ,
మురళీనగర్, మాధవధార గ్రామం, గోపాలపట్నం మండలం.

తహశీల్దార్
గోపాలపట్నం మండలం
విశాఖపట్నం